


# సంపెంగ

గుడిసేవ సుందరరామయ్య

అశోక అందాల తోట—

ఆ తోటలో ఉన్నాయి ఎన్నోరకాల పూలు-

పరువంలో ఉన్న పడుచుల్లాంటి గులాబీలు-

యౌవనాన్ని కోల్పోయిన విలాసినుల్లాంటి ప్రొద్దుతిరుగుడు పూలు—

పిచ్చుకత్తుల్లా విచ్చిన చంద్రకాంతలు-

విశ్మల హృదయాల్లాంటి మల్లె మొగ్గలు-

సువాసనలను వెదజల్లుతున్న సన్నజాజులు-

మారణాయుధాలలా నిలబడిన మందార మొగ్గలు—

మకరందాన్ని ఆస్వాదించే నిమిత్తం తిరుగుతున్న గండుతుమ్మెదలు—

వింత వింత మానవ ప్రవృత్తులకు ప్రతీకలుగా నిల్చిన రంగురంగుల క్రోటన్స్-

సాయంకాలం నీరెండలో విందుగా కన్పించింది తోట-

ఆ తోటలో—

ఓ మూల ముద్దబంతి పువ్వులాంటి మగువ చెట్లకు కుదుళ్ళు చేస్తూంది.

చెట్ల మధ్య సందు చూసుకొని ఆమె వదనాన్ని తొంగి చూస్తూనే పడమటి కొండల్లోకి జారిపోయాడు ప్రభాకరుడు.

పుష్టిగా వున్న శరీరానికి తగ్గ రమణీయమైన అందం ఆమె వదనంలో కన్పించకపోయినప్పటికీ ఆమె కళ్ళల్లో మాత్రం మనిషిని ఆకట్టుకునే వాడిచూపు కన్పిస్తుంది.

చీకటి తెరలు కాలుతున్నప్పటికీ లెక్కచేయకుండా ఏకదీక్షతో కుదుళ్ళు చేస్తున్న ఆ అమ్మాయి "రేఖా! రేఖా! అన్న పిలుపు విని వెనక్కి తిరిగింది.

లేత గులాబిరంగు చీరలో అప్పుడే వికసించిన గులాబీ బాలలా ముగ్ధమనోహరంగా మెరిసిపోతున్న లావణ్యవతి కన్పించింది.

"నీ వింకా ఇక్కడే కూర్చున్నావా? భాస్కరంబావ వచ్చే టైమయింది.

"ఇదిగో వచ్చేస్తున్నాను! ఈ ఒక్కచెట్టుకూ కుదురు చేసి వస్తాను" అంది ఆ అమ్మాయి

"సురేఖా! చక్కగా పూలుపూసే గులాబి చెట్లను వదిలేసి ఈ సంపెంగ చెట్టుకు కుదురు చేస్తున్నావా?"

"చక్కగాపూలుపూస్తున్నాయి కాబట్టే గులాబి చెట్లకు కుదుళ్ళు అనవసరం! ఈ సంపెంగచెట్టు చూడు! ఇంకా ఒక్కపువ్వయినా పూయలేదు. ఆ పువ్వు పూసే వరకైనా జాగ్రత్తగా చూడకపోతే ఎలాగక్కా?'

"నీపిచ్చి నీకానందం! అవేమైనా అందంగా వుంటాయా, ఏమన్నానా! పాడువాసనా, అవీను! "అదేమిటక్కా, సంపెంగలు పాడువాసన వేస్తాయా?"

"కాదులే తల్లీ! మంచి సుగంధ వాసనలే వేస్తాయి. కాని నేను బయట కెళ్తున్నాను. బావ వచ్చే సరికల్లా మా ఫ్రెండుతో వచ్చేస్తాను! మహంకాళీ తాతయ్య వంటగదిలోనే వున్నాడు. నీవుకూడా త్వరగావెళ్ళి ఆ కాఫీ, ఫలహారాల వ్యవహారం చూడు!" అంటూ వ్యానిటీ బ్యాగును ఊపుకుంటూ వయ్యారంగా వెళ్ళిపోయింది సుజాత.

పంపుదగ్గర చేతులు కడుక్కొని వంటింట్లోకి వెళ్ళింది సురేఖ.

లోపల మహంకాళీ స్టవ్‌మీదున్న మూకుడుని దించుతున్నాడు.

"ఏం తాతా, నన్నుకూడా సాయం చేయమంటావా? అని అడిగింది సురేఖ.

"ఫలహారాలన్నీ తయారుచేశాను. ఇక కాఫీ ఒక్కటే తరువాయి అన్నాడు.

"కాఫీకూడా అప్పుడే పెట్టేస్తావా? ఆశ్చర్యంగా అడిగింది సురేఖ

"అవునమ్మా! సుజాత వెళ్ళింది. ఇంకో పావుగంటలో భాస్కరంబాబు వస్తాడంటగా!"

'అవును' అంటూ వెళ్ళి హాల్లోవున్న కుర్చీలో కూర్చుండిపోయింది సురేఖ.

బావ వచ్చేస్తాడు ... ఇంకో పావుగంటలో తన భాస్కరం బావ వచ్చేస్తాడు ...... విజయవాడలో ఘనమైన సన్మానాన్ని పొంది తన బావ తిరిగి వచ్చేస్తాడు...... బావకు తనే స్వయంగా స్వీట్స్ అందించాలి! గులాబ్జామంటే బావకు చాలా ఇష్టం! అందుకే అక్కయ్య బావకు స్పెషల్‌గా వాటిని తయారుచేయించింది. బావ వద్దన్నకొద్దీ బలవంతాన మరో రెండు గులాబ్జామ్‌లను తినిపించాలి! అది సాధ్యమేనా? అక్కయ్య స్నేహితులంతా వస్తారు కాబోలు! అసలు అక్కయ్య తనను బయటకు రానీయదేమో? తనను చెల్లెలని చెప్పుకోవటమే ఆవిడకు చిన్నతనం! అసలు దేవుడు తననింత అందవిహీనంగా ఎందుకు చేశాడు? చదువుమీద శ్రద్ధ ఉన్నప్పటికీ ఈ రూపమే బలవంతాన చదువును మాన్పించింది. తనూ, అక్కా కలసి స్కూలుకు పోతుంటే "కాకిముక్కు, దొండపండు" అని కుర్రాళ్ళు అరుస్తుంటే తనకు ఏడుపు వచ్చేది. తన మూలంగానే ఆమెను కూడా ఏడిపిస్తున్నారని అక్కయ్య అనప్పుడల్లా తన హృదయం బద్దలయ్యేది. తను చదువు మానేస్తున్నందుకు నాన్నగారు కూడా అభ్యంతరం చెప్పలేదు! తను కూడా చదువుకొని వుంటే ఈ పాటికి తన అక్కయ్యలా, బి. ఏ. చదువుతుండేది......

"అమ్మా! రేఖమ్మా! స్టవ్‌మీద పాలు పెట్టాను, కాగిన తర్వాత దింపేయ్! నే వెళ్ళి స్నానం చేసివస్తా!" అంటూ బయటకెళ్లాడు మహంకాళి.

సురేఖ మళ్ళీ ఆలోచనా సముద్రంలో పడింది. చదువు మానేయగానే ఎక్కువ కాలాన్ని పుస్తకాలు చదవటంతోనే గడిపేది తను! అయినా రోజు గడవటమే కష్టమయ్యేది! అందుచేతే వంటలక్కను మాన్పించేసి తనే వంట చేయటం మొదలు పెట్టింది. మొదటిసారిగా తను వంట చేసినప్పుడు భాస్కరం బావకూడా ఇక్కడే భోంచేశాడు. ఆ రోజు తను వండిన బంగళాదుంప కూర, కాకరకాయ వేపుడు చాలా బాగున్నాయని బావ తెగ పొగిడాడు. నాన్నగారు కూడా "అమ్మాయికి కొత్తయినా బాగా నే చేసింది" అని మెచ్చుకొన్నారు. కాని అక్కయ్య మాత్రం "ఆఁ! ఏం కూరలని? దాని ముఖంలా వున్నాయి!" అని కూరలన్నీ వదిలేసింది.

అక్కయ్యకు తనంటే ఎందుకంత కోపం? తనేమైనా అక్కయ్యను మించిన అందగత్తా? తనేమైనా అక్కయ్యకంటె ఎక్కువ చదువుకొందా?

తనేమైనా అక్కయ్యలా పదిమందిని ఆకర్షించ గల్గుతుందా?

ఏవిధంగా చూసినా అక్కయ్యదే పైచేయి! మాటిమాటికీ "దానిముఖం, దానిముఖం!" అంటూ తన ముఖాన్ని దెప్పిపొడుస్తుందేమిటి?

హే భగవాన్!

తనకీ జీవితాన్నెందుకిచ్చావు?

పుట్టగానే తల్లిని పోగొట్టుకొన్న పాపాత్మురాలని నల్గురూ తనను అసహ్యించుకొన్నారు. తన నల్లటి రూపానికి తోడు, ఆరో సంవత్సరంలో మశూచికం వచ్చి తన ముఖం నిండా వికృతమైన గుంటలు ఏర్పడ్డాయి. ఆ వ్యాధితో తను చనిపోయినా బాగుండేది!

ఇంత అందవికారమైన రూపంతో తను జీవించేదెలా?

బావకూడా తనంటే ఇష్టం లేదేమో?

తను పల్కరిస్తే ముభావంగా మాట్లాడేవాడు. అక్కయ్యతో మాత్రం గంటల తరబడి నవ్వుతూ మాట్లాడేవాడు. వారిద్దరూ అలా నవ్వుకొంటూ కబుర్లు చెప్పుకొంటుంటే తన మనస్సు అంతని అగాధాల్లోకి జారిపోయేది!...

"అదేమిటమ్మా, మాడువాసన వేస్తూంది?" అంటూనే మహంకాళి వంటగదిలోకి వెళ్ళాడు.

"పాల విషయమే మర్చిపోయాను తాతా!" అంటూ సురేఖకూడా అతని వెనుకే వెళ్ళింది.

పాలు పొంగిపోయి స్టవ్ కూడా ఆరిపోయింది.

"పాల విషయం చెప్పేవెళ్ళాను కదమ్మా!" అంటూనే ఒలికిన పాలను గుడ్డతో తుడిచివేశాడు మహంకాళి.

"నేనేదో ఆలోచనలోపడి మర్చిపోయాను తాతా!" అంది సురేఖ.

పెద్ద మరచెంబు పుచ్చుకొని బయటకెళ్ళాడు మహంకాళి.

"ఆఖరికి ఎంతోకాలంనుంచి తమింట్లో పని చేస్తున్న మహంకాళి తాతకూడా తను లోకువేనా?" అనుకొంటూ గాఢంగా నిట్టూర్చింది సురేఖ.

* * *

విశాలమైన రోడ్డుమీద వేగంగా దూసుకుపోతూంది మోటారు సైకిలు!

ఇప్పుడు భాస్కరానికెంతో ఆనందంగా వుంది.

ఎంతోమంది క్రీడాకారులు, ప్రముఖుల సమక్షంలో తనకిక్కడ సన్మానం జరగటం గర్వించతగ్గ విషయం!

ఏదో హాబీగా నేర్చుకొన్న క్రికెట్ ఆట నేడు తనకింత ఖ్యాతిని తెచ్చిపెడుతుందని ఎవ్వరూ అనుకోలేదు! విదేశాలకు వెళ్తున్న భారతీయ జట్టులో తనుకూడా ఉంటాడని తనెప్పుడూ ఊహించలేదు!

తను క్రికెట్‌లో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించటానికి సగం కారణం సుజాత ఇచ్చిన ప్రోత్సాహమే!

సుజాతకు తనంటే ఇష్టం!

క్రికెట్ అంటే ఇంకా ఇష్టం!!

బ్రహ్మాండంగా బౌలింగ్ చేసే తన చేయంటే మరింత ఇష్టం!!!


# మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు

1. "తెలుసుకోతగ్గవి" : ఈ పుస్తకము సకల విజ్ఞాన కల్పతరువు. మీ జీవిత సంతోషానికు మీరు తెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు కలవు: వెల. రు. 5-00
2. అద్భుత హాస్య కథలు : ఈ పుస్తకంలో బ్రహ్మాండముగా నవ్వు పుట్టించే చిన్న కథలు కొన్ని వందలున్నాయి. నవ్వి, నవ్వించటానికి ఉపయోగం. వెల రు. 3-50
3. చేతిపనులు : చిన్న పరిశ్రమలకు, సర్దాకి, సంపాదనకు మీ కిష్టమైన ఎన్నోరకాల సరుకులు సులభంగా ఇంట్లో తయారుచేసుకొనే విధానాలు ఇందుగలవు. వెల రు. 3-50
4. మంత్రశక్తి : మీ కోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధ మంత్రాలు, వాటి అద్భుత రహస్యాలు, సాధన మార్గాలు ఈ పుస్తకములో పేర్కొనబడినవి వెల రు. 3-50
5. జీవిత రహస్యాలు : మీ దాంపత్య జీవితాన్ని సంపూర్ణ ఆనందమయం చేసుకొనడానికి అనేక దివ్య కామసూత్రాలు ఇందుకలవు. వెల రు. 3-50
6. యువతి : స్త్రీలను గురించి యువతీ, యువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహల విషయాలు గలవు. వెల రు. 3-50
7. సంతానము : కామ సుఖాలు అనుభవించుచుకూడ అవసరం లేనపుడు గర్భం రాకుండా అవలంబించదగు 60 సులభ మార్గాలు పేర్కొనబడినవి వెల రు. 3-50

పై ఏడు పుస్తకముల రచయిత : ఎ. ఎస్. మూర్తి, యం. ఎ. పోస్టు ఖర్చులుచితం.

దేశసేవ ప్రచురణలు, అశోక్ నగర్, ఏలూరు—2 (ఆంధ్ర) కు వ్రాస్తే, మీకు కావలసిన పుస్తకాలు వి. పి. పోస్టుద్వారా పంపబడును.

# సంపెంగ

"నీకెప్పుడూ ఆలోచనలే ! సరే ! ఎక్కడైనా దొరుకుతాయేమో. వెళ్లొస్తా !" అంటూ

పెంచరీలను చేసే తన కాళ్ళంటే ఇంకా ఇంకా ఇష్టం !!!!

తనక్కూడా క్రికెట్ అంటే ఇష్టమే—

సుజాతంటే ఇంకా ఇష్టం—

సిగ్గులొలికే ఆమె బుగ్గలంటే మరింత ఇష్టం—

గులాబి పువ్వులాంటి ఆమె సుకుమార రూపమంటే మరీమరీ ఇష్టం—

గులాబిచెట్టుకున్న ముళ్ళలా ఆమె మాటలు మాత్రం వాడిగానే వుంటాయి. అందుకనే కాలేజీ కుర్రాళ్ళుకూడా నోరె త్తేవాళ్ళు కాదు.

తను యూనివర్సిటీలో చదువుతుండగా సుజాత చేసిన ఘనకార్యం గురించి అమ్మ ఉత్తరం వ్రాసింది. అది చదివాక తనకు నవ్వాగలేదు.

పి. యు. సి. లో చేరిన నాల్గు నెలలకే సుజాతకు ఓ లవ్ లెటర్ వచ్చిందట ! దాన్ని ప్రిన్సిపాల్‌కూ ఇవ్వలేదు ! చించిపారవేయనూ లేదూ ! అది వ్రాసినవాడి అడ్రసు తెల్సుకొని సరాసరి వాడింటికి వెళ్ళిందట. వాడి తండ్రిని పిల్చి ప్రేమలేఖను చూపించి 'మీవాడు ఇలాంటి పిచ్చివేషాలు వేయటం అంత మంచిది కాదు ! నేను మంచిదాన్ని కాబట్టి ఆ లెటర్ మీకిచ్చాను. అదే ప్రిన్సిపాల్‌గారికి నేనిస్తే మీ వాడి చదువు నాశనమైపోయేది ! ఇకనైనా ఆడపిల్లలకు ఇలాంటి ఉత్తరాలను రాయకుండా మీ వాణ్ణి అదుపులో పెట్టుకోండి" అనేసి వచ్చేసిందట

ఆనాటి నుంచీ "డేంజర్ లైట్" అనే బిరుదు ఇచ్చినప్పటికీ కుర్రవాళ్ళు వెర్రివేషాలు వేయటం తగ్గించారట !

తను సెలవులకు ఇంటికి వెళ్ళినపుడు సుజాతను ఆ విషయం అడిగితే "అలాంటి వెధవలకు అలానే బుద్ధి చెప్పాలి బావా !" అంది కసిగా.

అయితే పొరపాటున నేను రాసినా అలానే తీసికెళ్ళి మా అమ్మకిస్తావా ?" అని తను అడిగేసరికి "బలేవాడివి బావా ! నీ వద్దనుంచి అలాంటి ఉత్తరాలు రావాలే కాని ప్రాణానికి ప్రాణంగా చూసుకొంటాను. గుండెలో దాచుకొంటాను" అంటూ ఇంట్లోకి పరిగెత్తింది.

గులాబి బాలను చేరటానికి ఫోషే గండు తుమ్మెదలా మోటారు సైకిలు మీద ముందుకు దూసుకుపోతున్నాడు భాస్కరం.

ఒకసారి వాచీ చూసుకొన్నాడు.

ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. సుజాత ఫ్రెండ్సుతో సహా తనకోసం ఎదురు చూస్తాంటుంది. తన గౌరవార్థం పార్టీ ఏర్పాటు చేస్తానని ఎప్పట్నుంచో అంటోంది కాని తనందుకు సమ్మతించలేదు. చివరకు బలవంతాన నేటికి ఒప్పుకొన్నాడు తను. తప్పకుండా అనుకొన్న టైమ్ ప్రకారం రావాలని తనతో ప్రామిస్ కూడా చేయించుకొంది......

మోటారు సైకిలు వేగాన్ని పెంచుకొంది

భాస్కరం ఆలోచనలకంటె వేగంగా పరుగులు తీస్తూంది !

సుజాతను గురించే ఆలోచిస్తున్న భాస్కరం పరిసరాలను కూడా మర్చిపోతున్నాడు. ఎదురుగా ఒక లారీ, ఒక చిన్నకారు పోటీలుపడి రావటం గమనించలేకపోయాడు.

వాటి హెడ్‌లైట్ల కాంతికి అతని కళ్ళు చెదిరాయి—

ఎంతో బలవంతాన మోటారుసైకిలును ప్రక్కకు తిప్పాడు—

లారీడ్రైవరీ కూడా సడన్‌బ్రేక్ వేశాడు—

చిన్నకారు మాత్రం మోటారు సైకిల్‌ను కొంతదూరం ఈడ్చుకొంటూ పోయింది—

* * *

కాలేజీనుంచి అప్పుడే ఇంటికివచ్చిన సుజాతనుద్దేశించి "అక్కా ! కాస్త త్వరగా ముఖం కడుక్కొనిరా !" అంది సురేఖ.

"ఏమిటే, అంత హడావుడి ?" విసుక్కొంటూనే అడిగింది.

"భాస్కరం బావను హాస్పిటల్‌నుంచి ఇంటికి తీసుకువచ్చారట. నాన్న ఇప్పుడే అత్తయ్యగారింటికి వెళ్ళారు. నీవు రాగానె మనిద్దర్నీకూడా రమ్మన్నాడు అంది సురేఖ

నిర్లక్ష్యంగా లోపలికెళ్ళింది సుజాత.

మరో పావుగంట తర్వాత చక్కగా ముస్తాబయి బయటకు వచ్చింది;

అక్కచెల్లెళ్లిద్దరూ కలసి రిక్షా ఎక్కారు.

భాస్కరం వాళ్ళ ఇంట్లోకి అడుగు పెట్టగానే భాస్కరం తల్లి శోకదేవతలా కన్పించింది.

నాగయ్యగారు చెల్లెల్ని ఓదార్చటానికి చూస్తున్నారు.

మేనకోడళ్ళిద్దర్నీ చూడగానే భాస్కరం తల్లి శాంతమ్మగారికి దుఃఖం మరింత అధికమైంది.

సుజాత మౌనంగా తండ్రి ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చుండిపోయింది.

సురేఖ మాత్రం శాంతమ్మగారి దగ్గరకెళ్ళి "ఊరుకో అత్తయ్యా !" అంటూ తను కూడా కన్నీరు పెట్టుకుంది

"భాస్కరమ్మీద ఎన్నో ఆశలు పెట్టుకొన్నాను. నా ఇంటి అల్లుణ్ణి చేసుకుని నా ఆస్తికి కూడా వారసుణ్ణి చేద్దామనుకొన్నాను. కాని ఆ పరమేశ్వరుడు ఇంతలోనే నా ఆశలను అడియాసలు చేశాడు" అన్నారు నాగయ్యగారు.

శాంతమ్మగారు అన్నగారి మాటలకు విస్తుపోయింది.


దాంపత్యంలో సుఖంలేని అసమర్థుడు.... ఏం చేస్తాడూ ! ... నిరాశ చెంది తన భార్యను సుఖపెట్టలేక సిగ్గుతో కుమిలిపోతూ వుంటాడు. కారణం : కొందరు బాల్యంలోనే కామవాంఛలకు గురియై మితిమీరి స్త్రీ సాంగత్యం చేయడంచేత మరికొందరు చెడుస్త్రీ సాహవాసం చేయడంచేత, ఇంకొందరు హస్తప్రయోగాలకు అలవాటుపడివీర్యాన్ని నష్టపరచుకొని, జననేంద్రియబలం సన్నగిల్లి వక్రతలు ఏర్పడి నపుంసకులై దాంపత్యంలో సుఖం అనుభవించలేక దిగులుపడుతూ వుంటారు. అట్టివారి దాంపత్యంలో తిరిగి ఆనందం చిగురించడానికి పరిపుష్ఠకరం. వీర్యం, నరముల పటుత్వం, దేహదారుఢ్యం, ఉత్సాహం, చురుకుదనం సమస్త అవయవములకు చక్కని బలం ఉత్తాపనశక్తి అమిత భోగశక్తి అవసరం, ఇవన్నీ త్వరితగతిని సమకూర్చగల దివ్య ఔషధం కామరూపి లేహ్యం స్వప్న స్ఖలనం నరముల బలహీనత అలసట, నిరుత్సాహం శీఘ్రస్ఖలనం మొదలగునవి మాన్పి పుష్కలమైన రక్తాన్ని వీర్యాన్ని శరీరకాంతిని, నరముల పటుత్వాన్నిచ్చి తిరిగి యౌవనులుగా చేసే అపారశక్తినివ్వగల అపూర్వ ఔషధం. "కామరూపి లేహ్యం"





వృద్ధులు విద్యార్థులుకూడా వాడతగిన బలవర్ధక ఔషధం. వెల ఒక నెలకు రు. 10-00 పోస్టు ఖర్చులు రు. 3-25

కాళ్ళలో ఆనెలకు పాదములు నేలపై పెట్టి నడవలేక బాధపడుతూ ఆనెలకు ఎన్నో మందులు వాడి నిరాశచెందిన వారు ఈ "బహిర్లేపన తైలం వాడిన ఆనెలు తిరిగి రాకుండా శాశ్వతంగా మాన్పును వెల పోస్టు ఖర్చులతో సహా రు. 6-25.

భరణీ అండ్ కో, పోస్టుబాక్సు నెం. 64, మద్రాసు—1

"మొన్న మాఘమాసంలో పెళ్ళి చేసేసినా దాని మాంగల్య బలంతోనైనా ఈ ఆపద గడిచి వుండేదేమో!" అనుకొన్నారు నాగయ్యగారు స్వగతంగా.

సుజాత కుర్చీలోంచి లేచి ప్రక్కగదిలో ఉన్న భాస్కరం దగ్గర కెళ్ళింది.

ఒకనాడు తనెంతో అభిమానించిన అందమైన శరీరం కట్లుకట్టి చూడలేనంత జుగుప్సను కల్గిస్తూంది.

తనను చూసి కళ్ళు తెరచిన భాస్కరాన్ని ఉద్దేశించి "ఎలా వుంది బావా?" అని అడిగింది సుజాత.

"ఫర్వాలేదు" అన్నాడు భాస్కరం ముభావంగా.

"జాగ్రత్తగా మెడిసిన్స్ వాడుతూ వుండు" అనేసి బయటకొచ్చింది.

"నాన్నా! ఈ వేళ ఓ పార్టీ వుంది. నా ఫ్రండ్సంతా వెయిట్ చేస్తుంటారు! వస్తా!" అంటూ వెళ్ళిపోయింది

"దురదృష్టవంతురాలు! భాస్కరానికి భార్య అయ్యే అదృష్టానికి నోచుకోలేదు" అని గొణుక్కున్నారు నాగయ్యగారు.

"అదేమిటన్నయ్యా. అలా అంటావు? వసిన పోతూ పోతూ సుజాత నెలాగైనా మా ఇంటి కోడల్నిగా చేసుకొమ్మని మరీ మరీ నా దగ్గర వాగ్దానం చేయించుకొంది. భాస్కరానికి కూడా అదంటే ఎంత ఇష్టమో నీకు తెల్సు కదా?"

"అది నిజమేననుకో! కాని అది అప్పుడే పెళ్ళిచేసుకోనంటోంది. భాస్కరానికి జరిగిన విపత్తు దాని మనస్సును విరిచేసింది" అన్నారు నాగయ్యగారు.

సురేఖ తండ్రివైపు వింతగా చూసింది.

గతరాత్రి తన అక్కయ్యకు, తండ్రికి మధ్య జరిగిన సంభాషణ ఆమె చెవుల్లో మారుమ్రోగింది.

"ఏమైనా, బావకు ఏక్సిడెంటు అయినాక నీవు హాస్పిటల్‌కు ఎన్నిసార్లు వెళ్ళావ్?"

"అప్పుడప్పుడూ వెళ్తూనే వున్నానుకదా! హాస్పిటల్ చుట్టూ రోజూ తిరగమంటావా? అయినా ఎవరో ఒకరు వెళ్తూనే వున్నారుగా! ఇంకా నేనుకూడా ఎందుకు?"

"అలా అంటే ఎలాగమ్మా? బావ ఏమైనా పరాయివాడా?"

"మీ వ్యవహారం చూస్తుంటే పెళ్ళికూడా చేసుకోమనేట్లున్నారే!"

"పిచ్చితల్లీ! ఆ కుంటివాడితో పెళ్ళిచేసి నీ జీవితాన్ని నరకంచేసే కిరాతకుడనను కొన్నావా? అది కాదమ్మా నా ఉద్దేశం! రేపే బావను ఇంటికి తీసుకువస్తున్నారు. ఓసారి వెళ్ళి పలకరించు!"

సురేఖ మౌనంగా వుండిపోయింది. తన తండ్రి మనస్తత్వానికి, మాటలకు ఆశ్చర్యపోయింది.

"అయితే భాస్కరానికి అన్యాయం చేస్తావా, అన్నయ్యా?" అంటూ దీనంగా అడిగింది కాంతమ్మగారు.

"ఇందులో అన్యాయమేముందమ్మా? చూస్తూ చూస్తూ వాణ్ణి పెళ్ళిచేసుకొనటానికి ఎవరు సిద్ధపడ్తారు చెప్పు? అమ్మాయికి ఇష్టంలేనిదే నేను మాత్రం ఏం చేయగలను చెప్పు?"

"అమ్మాయి కిష్టంలేదా? చిన్నప్పట్నుంచీ బావా! బావా! అంటూ కలసి మెలసి తిరిగిన అమ్మాయికి నేడు భాస్కరం అంటే ఇష్టం లేదా?' కుమిలి కుమిలి ఏడ్చింది కాంతమ్మగారు.

"అత్తయ్యా! అలా అనకు: భాస్కరం బావంటె నాకిష్టమే." అంది సురేఖ.

"సురేఖా!" అంటూ కేకవేశారు నాగయ్యగారు.

"అవును నాన్నా! భాస్కరం బావంటే నాకు మాత్రం ఇష్టమే! బావకిష్టమైతే పెళ్ళిచేసుకోవటానికి నాకేమీ అభ్యంతరంలేదు" అంటూ భాస్కరం గదిలోకి వెళ్ళింది.

అప్పటివరకూ జరిగిన సంభాషణనంతా విన్న భాస్కరం లోపలికొచ్చిన సురేఖను చూడగానే 'చాలా తొందరపడి మాట్లాడుతున్నావ్, రేఖా! అన్నాడు.

"లేదు బావా! మనస్ఫూర్తిగానే మాట్లాడుతున్నాను"

"రేఖా! ఈ అవిటివాణ్ణి చేసుకొని నీలాంటి అనురాగమూర్తి నరకమనుభవించటం నా కిష్టం లేదు?"

'బావా!' అంటూ తన చేతితో భాస్కరం నోటిని మూసి "దయచేసి అలా మాట్లాడకు" అవిటివాణ్ణని నీవు అంటుంటే నా హృదయం తరుక్కుపోతుంది! నీ కాలు తప్పకుండా వస్తుంది! త్వరలోనే నీవు మామూలుగా నడువగలవు!" అంది.

"పిచ్చి రేఖా! రెక్కలు విరిగిన తుమ్మెద ఎగరలేదు! ఇంతకాలంగా ఎంతో స్వేచ్ఛగా తిరిగాను. నాకంటె అదృష్టవంతుడు లేడని విర్రవీగాను! కాని దేవుడు నా గర్వానికి తగ్గ గుణపాఠాన్ని నేర్పాడు" అంటూ నిట్టూర్చాడు భాస్కరం.

"అనవసరం గతాన్ని త్రవ్వుకొని బాధపడకు బావా!"

"లేదు రేఖా! లేదు" గతాన్ని మర్చిపోలేను. పచ్చగా తిరుగుతున్నంతసేపే మానవునికి విలువ వుంటుందని నిరూపించిన సుజాత ప్రవర్తనను మర్చిపోలేను."

"అక్క మనస్తత్వం తెల్సికూడా అలా బాధపడ్తావెందుకు బావా?"

"సుజాత నిజస్వరూపం ఇప్పుడిప్పుడే అర్థం చేసుకొంటున్నాను. 'నీతో ఒక్కరోజు మాట్లాడక పోతే ఎలానో ఉంటుంది బావా!' అన్న సుజాత

నేడు తన ఫ్రండ్సు వెయిట్ చేస్తున్నారని వెళ్ళిపోయింది. 'నాక్ప్రపంచంలో నీ కంటె ఆత్మీయులెవ్వరూ లేరు బావా!' అన్న సుజాత నేడు ఈ అవిటివాణ్ణిచూసి కనీసం సానుభూతి కూడా చూపలేకపోతూంది."

"బావా! లేనిపోని ఆలోచనలతో నీ హృదయాన్ని చిత్రహింస చేసుకొంటున్నావ్?"

"లేదు రేఖా! నివురుకప్పిన నిప్పులాంటి సత్యాన్ని తెల్సుకొంటున్నాను! గులాబీలు పైకి అందంగా కన్పించి ఎంత ఆనందాన్నిస్తాయో, అంతకు రెట్టింపుగా తమ వాడియైన ముళ్ళతో బాధను కల్గిస్తాయని అర్థమైంది. అశాశ్వతమైన

అందాన్ని కల్గిన గులాబీల కంటె సామాన్యంగా కన్పించే సంపెంగల సువాసనలే మనస్సుకు ఆహ్లాదాన్ని కల్గిస్తాయని తెల్సుకొన్నాను. పద్ద జాల సౌరభాలను వెదజల్లే సంపెంగవు నీవు!

నీలాంటి త్యాగమూర్తి, అనురాగమూర్తి నాకు మరదలు కావటం నా అదృష్టం" అంటూ సురేఖ చేతిని తన చేతుల్లోకి తీసుకొని సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడు.

భాస్కరం పల్కిన అమృతవాక్కులు హిమబిందువులై ఆ సంపెంగ బాలను పులకింపచేశాయి!

★


# రు. 10/ లకే ట్రాన్సిష్టర్



ఆల్ వరల్డ్ 3 బ్యాండ్ 1971 మోడల్ పోర్టబుల్ ట్రాన్సిష్టర్ వాతావరణప్రభావం లేనిది చక్కని కేబినెట్‌లో రంగులైటు అమర్చబడినది. మా నూతన పథకం ప్రకారం రు. 10/– లకే పొందండి. 5 సం॥లు గ్యారంటీ పోస్టేజి అదనం నచ్చకున్న పైకం వాపసు.

TIGER & Co.. (*Regd.*)
TANUKU(W.G)